- గోవిందా... గోవిందా... జైరంగా... జైజై రంగా... భక్తుల నామస్మరణ
- వైభవంగా రంగనాథుడి రథోత్సవం
- ప్రవాహంలా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన నగర వీధులు
- ఆకట్టుకున్న ఎదురుకోలు ఉత్సవం
- నేత్రానందంగా తెప్పోత్సవం

దీవించయ్యా... తల్పగిరీశా!

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారిని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ప్రవహంలా తరలివచ్చారు. దీంతో నగర వీధులు కిక్కిరిశాయి. గోవిందా.... గోవిందా... జైరంగా... జైజై రంగా.. అంటూ భక్తులు నినాదాలు చేస్తూ రథం లాగారు. తొలుత ఆలయంలో శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, కేరళ, తీన్‌మార్ వాయిద్యాల మధ్య రథం వరకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు చేశాక విశేష పూజలు చేసి, గుమ్మడికాయ, టెంకాయలు కొట్టి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయబాస్కర్‌రెడ్డి, మంత్రి నారాయణ కుటుంబ సభ్యులు, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నగర డీఎస్పీ సింధుప్రియ, ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు రథో త్సవాన్ని ప్రారంభించారు. శ్రీవారి తేరు తొలుత గొల్లవీధి (తూర్పు వీధి) మీదుగా రైల్వేట్రాక్ వరకు వెళ్లి తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. అనంతరం ఆలయం నుంచి సంతపేటలోని నాలుగుకాళ్ల మండపం వరకు కొనసాగింది.



ఆదివారం ఉదయం నగర వీధుల్లో సాగుతున్న రంగనాథుడి రథం



రథంపై ఆశీనులైన స్వామి, అమ్మవార్లు

నేత్రానందంగా ఎదురుకోలు ఉత్సవం

ఈ సందర్భంగా నిర్వహించిన ఎదురు కోలు ఉత్సవం నేత్రనం దంగా సాగింది. వేదగిరి లక్ష్మీనర సింహస్వామి, ఉభయదేవే రులతో కలిసి నరసింహ కొండ దిగి తప్పెట్లు, తాళాలతో ఊరే గింపుగా వచ్చి ములుముడి బస్టాండ్ వద్ద విడిది చేశారు. రంగనాథుడు కూడా తన దేవేరులతో రథంపై సంతపేట నాలుగు కాళ్ల మండపం వద్దకు వచ్చారు. ఆ సమయంలో నరసింహ స్వామి తరఫున రంగనాథస్వామికి, రంగనాథ స్వామి తరఫున నర సింహస్వామికి పట్టువ స్త్రాలు అర్చకస్వాములు ఇచ్చి పుచ్చుకుంటారు. ఈ కార్యక్రమానికి ముందు గత రాత్రి రంగనాథుడికి కల్యాణానికి తనను ఆహ్వానించలేదని నర సింహ స్వామి రథం వరకు వచ్చి అలిగి వెను దిరుగుతారు. అనంతరం రంగనాథస్వామి బతిమా లాడడం.. వంటి సంవాద కార్యక్రమాన్ని అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమాన్ని వేలాది మంది తిలకించి, పులకరించి పోయా రు. నరసిం హస్వామి తరఫున రంగ నాథుడికి పట్టువస్త్రాలు, ప్రసాదాలను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సతీమణి సుజితమ్మ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, ఉభయకర్తలు కొండేటి వెంకటేశ్వర్లురెడ్డి, శివారెడ్డి, ఆలయ ఈవో వేమూరు గోపి తదితరులు అందచేశారు.



సంతపేట నాలుకాళ్ల మండపం వద్ద జరిగిన ఎదురుకోలు ఉత్సవం

రథం లాగిన కమిషనర్

కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ రంగనాథుడి రథం లాగారు. రథోత్సవం ముగిసేవరకు ఆయన అక్కడే ఉండి హెల్త్ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లతో పారిశుధ్య కార్యక్రమాన్ని 100కి నూరు శాతం నిర్వహించేందుకు కృషి చేశారు. కాగా నగర డీఎస్పీ సింధుప్రియ రథోత్సవం సందర్భంగా క్యూలైన్లు, రోప్‌పార్టీ, ట్రాఫిక్, శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

నేత్రనందంగా తెప్పోత్సవం

నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి పుష్కరిణిలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత నరసింహస్వామి, రుక్మిణీ,సత్యభామ సమేత వేణు గోపాలస్వామి తెప్పోత్సవం నేత్రానందంగా సాగింది. ఈ సందర్భంగా కోనేరు వద్ద ఏర్పాటు చేసిన భారీ విద్యుద్దీపాలం కరణ, పూలాలంకర ణలు ఆకట్టుకున్నాయి. రంగనాథస్వామి రథోత్సవానికి తరలివచ్చిన వేదగిరి నరసింహస్వామి దంపతులకు సాయం సంధ్యవేళ మూలాపేట వేణుగోపాలస్వామి ఆతిథ్యం ఇచ్చేక్రమంలో ఈ ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మజ్జిగ చంద్రమౌళిరెడ్డి,ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు, వేదగిరి నరసింహస్వామి ఆలయ ఈవో వేమూరి గోపి, పెద్దసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మూలాపేట కోనేరులో ఆదివారం రాత్రి నిర్వహించిన నరసింహస్వామి, వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

పొట్టిశ్రీరాముల త్యాగాలు అజరామరం

- ఆ మహనీయుడి స్ఫూర్తితో ముందుకు సాగాలి
- జయంతి సందర్భంగా కలెక్టర్



నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం వాడవాడలా అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు నాయ కులు, అధికారులు, అభిమానులు పూలమాలు వేసి నివా ళులు అర్పించారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ ఓ.ఆనంద్, ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ పుష్పమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు త్యాగాలు అజరామరం అని అన్నారు. దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడు అయన అని పేర్కొన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖాధికారి వెంకటలక్ష్మి, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్ఐవో, సిబ్బంది

స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రంలో...

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్రం కోసం అసువులు బాసిన ధన్యజీవి పొట్టి శ్రీరాములు అని ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు అన్నారు. నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రంలో ఆదివారం పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. పొట్టిశ్రీరాములు చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'టెన్'షన్ వద్దు... !

- ప్రశాంతంగా రాయండి
- నేటి నుంచి పదోతరగతి పరీక్షలు
- 174 సెంటర్లలో నిర్వహణ
- సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- హాజరుకానున్న 33,434 మంది విద్యార్థులు
- ఓపెన్ స్కూలు పరీక్షలు కూడా నేటి నుంచే...

నెల్లూరు(విద్య), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు సోమవారం (నేటి) నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని అన్నీ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయడంతోపాటు ఏ విద్యార్థికీ కూడా అసౌకర్యం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. మాల్ ప్రాక్టీస్ నిరోధానికి చర్యలు చేపట్టడంతో పాటు అత్యంత సమస్యాత్మక కేంద్రాలపై నిఘా ఉంచారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ప్రశ్నపత్రంపై కోడ్

జంబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షల్లో ప్రశ్నపత్రంపై కోడ్ అమలు చేస్తున్నారు. ఇందువల్ల ప్రశ్న పత్రం లీక్ అయ్యే అవకాశం ఉండదని, ఏదైనా తప్పు జరిగినా ఎక్కడ జరిగిందో క్షణాల్లో తెలిసిపోతుందని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పద్ధతిని ప్రవేశపెట్టింది. ప్రతి విద్యార్థి ప్రశ్న పత్రంలో బార్‌కోడింగ్ ఉంటుందని, దీన్ని స్కాన్ చేస్తే ఏ విద్యార్థికి అందించాం, ఏ సెంటర్‌లో ప్రశ్నపత్రం ఉందన్న విషయాలతోపాటు పూర్తి వివరాలు బయ టకు వచ్చేస్తాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.245 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నారు. అరగంటముందే విద్యార్థులు కేంద్రం వద్దకు చేరుకోవాలి. అత్యవసర పరిస్థితి, అనారోగ్య కారణాలేమైనా ఉంటే 5 నుంచి 10 నిమిషాలు వెసులుబాటు కల్పిస్తారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

కాగా సోమవారం నుంచే ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లాలో ఆత్మకూరులో 6, కావలిలో 3, కందుకూరులో 4, కోవూరులో 2, నెల్లూరులో 4, వెంకటాచలంలో 2, ముత్తుకూరులో 1, కలువాయిలో 1, కేంద్ర కారాగారంలో ఒకటి కలిపి మొత్తం 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షకు 1597 మంది అభ్యాసకులు హాజరవుతున్నారన్నారు. పాఠశాలల్లో ఒంటిపూట బడులు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షలు నిర్వహిస్తున్న పాఠశాలల్లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తామని డీఈవో తెలిపారు.



సంగం జడ్పీ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో బాలాజీరావు

అర్ధగంట ముందే ప్రశ్నపత్రాలు

ప్రశ్నపత్రాలను 15 రూట్స్ ద్వారా పరీక్షకు 30 నిమిషాల ముందు మాత్రమే, ఆయా మండల కేంద్రాల నుంచి పోలీస్ బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలిస్తారు. జిల్లాలో 174 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యా ర్థులు నేలమీద కూర్చుని పరీక్ష రాయకుండా అన్నీ కేంద్రాల్లో బెంచీలను ఏర్పాటు చేశామని, పరీక్ష రాసే సమయంలో విద్యుత్ అసౌకర్యం కలగకుండా చూస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే తాగునీరు ఏర్పాటు చేయడంతో పాటు ఏఎన్ఎంలు కూడా మెడికల్ కిట్‌లతో అందు బాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌ను ఆర్టీసీ బస్సుల్లో చూపితే ఉచితంగా ప్రయాణించవచ్చునని అధికారులు తెలిపారు.

హాల్‌టికెట్ ఇవ్వకుంటే చర్యలు

ఫీజులు చెల్లించలేదని, మరే ఇతర కారణాలతో హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడితే సంబంధిత పాఠశాలలపై చర్యలు తప్పవని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు హెచ్చరించారు. ప్రభుత్వ యాప్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేసి నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కూడా కల్పించిందన్నారు.

33,434 మంది విద్యార్థుల సన్నద్ధం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ ఏడాది 16,250 మంది బాలురు, 17,184 మంది బాలికలు కలిపి మొత్తం 33,434 మంది ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. జిల్లాలో మొత్తం 16 సమస్యాత్మక కేంద్రాల్లో, ఏడు కేంద్రాలు అతి సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించి, అందులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

కాల్ సెంటర్ ఏర్పాటు

ఏవైనా సమస్యలు తెలియ చేసేందుకు కంట్రోల్‌రూమ్ కూడా ఏర్పాటు చేశామని డీఈవో పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు వారి సమస్యలను తెలియచేసేందుకు 83414 08109 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



నగరంలోని టౌన్‌హాలు వినాయక ఆలయంలో హాల్‌టిక్కెట్లకు పూజలు చేయిస్తున్న విద్యార్థులు

పరీక్షలంటే పండుగే..

విద్యార్థులు పరీక్షలను పండుగలా జరుపుకోవాలి. ఏడాదంతా కష్టపడి చదివిన చదువుకు పరీక్షల రోజునే విద్యార్థికి మార్కుల రూపంలో గుర్తింపు లభిస్తుంది. ఉన్న స్థితి నుంచి తరగతి పెరగడం రూపంలో ఉన్నతస్థితికి చేరుకునే అవకాశం లభిస్తుందని విద్యావేత్తలు చెబుతున్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని వారు సూచిస్తున్నారు.

ధాన్యం ధరలు పతనం

- మిల్లర్లు, దళారుల కుమ్మక్కు
- నష్టపోతున్న అన్నదాతలు

అనంతసాగరం మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ధాన్యం ధరలు పతనమవుతుండడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. మిల్లరు, దళారులు కుమ్మక్కై ధరలను దిగజార్చుతున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో వారం నుంచి వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మొదట్లో 1638 (క్రాస్‌లు), 15048 (తెలంగాణ) రకాలు పుట్టి ధర రూ. 21వేలు వరకు పలికాయి. దీంతో రైతులు ఆనందపడ్డారు. అయితే రోజురోజుకు ధరలు పతనం అవుతుండగా వారి ఆనందం ఆవిరయింది. ప్రస్తుతం ఈ రెండు రకాలు రూ. 18 వేల నుంచి రూ.19 వేలకు మాత్రమే కొంటామని వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే రైతులు నష్టపోవాల్సిందే. వరికోతలు జోరుగా సాగుతున్న తరుణంలో వాతావరణంలో మార్పువచ్చి వర్షం కురిస్తే, మరింతగా నష్టపోతామని రైతులు భావిస్తు న్నారు. ధాన్యాన్ని భద్రపరుచుకొనే వీలు లేక కల్లాల్లోనే తెగనమ్ముకోవాల్సిన వస్తున్నదని వారంటున్నారు. మిల్లర్లు, దళారులపై ప్రభుత్వం దృష్టి సారించి, ధాన్యం ధరలు తగ్గకుండా చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

అనంతసాగరం : ధాన్యం ఆరబెడుతున్నరైతులు



ఈతకెళ్లి బాలుడి మృతి

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో పెన్నాలో ఈతకెళ్లి నగరంలోని తడికలబజారు ప్రాంతానికి మహీధర్(14) మృతిచెందాడు. మహీధర్ ఆర్ ఎస్ఆర్ హైస్కూల్‌లో ఏడో తరగతి చదుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులు కిరణ్‌కుమార్, రోహన్‌కుమార్, సాయి, చరణ్‌తో కలిసి పెన్నాలో ఈతకొట్టేందుకు దిగాడు. ప్రవాహంలో మహీధర్ చిక్కుకుపోగా, ఇంతలో అక్కడకు చేరుకున్న అతని అన్న నందకిశోర్ రక్షించే ప్రయత్నం చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో మహీధర్ నీటిలో గల్లంతై మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వాడవాడలా పొట్టి శ్రీరాములుకు నివాళి

- ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

కందుకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే తలంపుతో తన ప్రాణాలను సహితం లెక్కచేయని మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కొనియాడారు. పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా జరపాలని ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆర్యవైశ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు తన్నీరు మల్లికార్జున, పిడికిటి వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసింహం, విశ్రాంత పంచాయతీ రాజ్ డీఈ వెంకట మురళీమోహన్ పాల్గొన్నారు.

● కావలి టౌన్: పట్టణ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ అధ్యక్షతన ట్రంకురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తివాసులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నేతలు ప్రొఫెసర్ సునీల్, ఓరుగంటి రామకృష్ణ, తిరివీధి ప్రసాద్, గాదంశెట్టి మధు, రమణయ్య పాల్గొన్నారు.

● టీడీపీ ఆధ్వర్యంలో ముసునూరులోని టీడీపీ కార్యాయంలో పట్టణ అధ్య క్షుడు గుత్తికొండ కిషోర్ అధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, నేతలు జ్యోతి బాబురావు, కోట రమేష్, రామ కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పూడి నారాయణ అధ్యక్షతన నేతలు పాల్గొన్నారు. .

● బీజేపీ నాయకులు ఏపీ జీఎస్టీ గ్రీవెన్స్ మెంబర్ అమరా సుబ్బారావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ప్రభాకర్‌నాయుడు ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభాకర్‌నాయుడు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు ఉన్నారు.

● అల్లూరు:స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌లతోపాటు ఎంపీడీఓ రజనీకాంత్, జడ్పీటీపీ వేణమ్మలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

● తహసీల్దారు కార్యాలయంలో: డీటీ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: తహసీల్దారు సురేష్‌బాబు జువ్వలదిన్నెలోని పొట్టి శ్రీరాములు స్మారక భవనంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి సిబ్బందితో కలసి నివాళులర్పించారు.

● ఉలవపాడు: మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పొన్నూరు రామాంజనేయులు, ఉప కార్యదర్శి దివ్యానంద గుప్తా, కమిటీ సభ్యులు వక్కలగడ్డ మణికంఠ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కందుకూరు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకులు


కావలి: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు


కావలి : పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు


అల్లూరు: నివాళులర్పిస్తున్న డీటీ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది


బిట్రగుంట: నివాళులర్పిస్తున్న తహసీల్దారు


ఉలవపాడు: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

న్యూస్ బాక్స్

అరటి పండ్ల లారీ బోల్తా

వలేటివారిపాలెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):అత్తింటివారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిలో ఆదివారం ఉదయం 6గంటల సమయంలో వేగంగా వెళ్తూ మలుపు వద్ద అదుపు తప్పి అరటికాయల లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనిల్‌కు తీవ్రంగా గాయపడ్డారు. వలేటి వారిపాలెం నుంచి కందుకూరు వైపు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గాయపడిన అనిల్‌ను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మరిదినాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

కావలి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామమూర్తిపేట సాయిబాబు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ పర్యవేక్షణలో నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన శిబిరంలో 360మందికి పరీక్షలు నిర్వహించి 70మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి ఆలయ కమిటీ పెద్దలు టంగుటూరి ప్రసాద్ సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, ప్రోగ్రాం కన్వీనర్ సునీల్, నరసింహారావు, ఓరుగంటి రామకృష్ణ, కోశాధికారి చక్రవర్తి, మంచికంటి మురళి, మధు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్

కావలి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే స్వచ్ఛాంధ్ర లక్ష్యం అని కెజీబీవీ జిల్లా డిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సీహెచ్.వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం స్థానిక ముసునూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. గ్రామ, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటర్అధికారి సుధీర్‌బాబు, ఆడపిల్లల సంరక్షణ అధికారిణి మమత, ప్రిన్సిపల్ సంధ్యారాణి పాల్గొన్నారు.

నేటి నుంచి బస్సు సౌకర్యం

కావలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి మద్దూరుపాడు టిడ్కో గృహ సముదాయానికి బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీలో చేరిక

కందుకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుర్రంవారి పాలెంకు చెందిన వైసీపీ నాయకులు తానికొండ శ్రీని వాసులు ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తానికొండ శ్రీనివాసులు గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొడపాటి నరసింహరావు, టెలికాం బోర్డు మెంబర్ గుర్రం మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, చడలవాడ కొండయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 23మంది లబ్ధిదారులకు రూ.19.42లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్రప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి, శాసన సభ్యునికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

కందుకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దళితులు, బహుజనులకు రాజ్యాధికారం సాధనలో అంబేడ్కర్ కన్న కలలను నిజం చేసింది మాన్యశ్రీ కాన్షిరాం అని న్యాయవాది ముప్పవరపు కిషోర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్థానిక వెంగమాంబ ఫంక్షన్ హాల్‌ల్లో ఆదివారం రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్షీరాం జయంతి వేడుకలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బెజవాడ కొండయ్య, గేరా చిరంజీవి, పాలేటి కోటేశ్వరరావు, బీ.వెంకటేశ్వర్లు, యాదవ జేపీసీ మిరియం శ్రీనివాసులు, ఎండ్లూరి బాలు ఉన్నారు.

శ్రీవారికి అశ్వవాహన సేవ



కావలి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కచ్చేరిమిట్టలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నవరం సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు అర్చక బృందం ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. ఆదివారం ఉదయం హోమం, వసంతోత్సవం జరిగింది. సాయంత్రం శ్రీవారు అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజనం అడుగడునా శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి చేపట్టిన ధ్వజాఅవరోహణలో ఆలయ కమిటీ పెద్దలు తిరివీధి బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్, నరహరి హరిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో తిరివీధి ప్రసాద్ ఉభయకర్తగా భక్తులకు అన్నసంతర్పణ చేపడతారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కావలి టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) పవిత్ర రంజాన్‌మాసంలో పేద మహిళలకు వస్త్రదానం చేయడం అభినందనీయం అని రెండవ పట్టణ సీఐ గిరిబాబు అన్నారు. హ్యాపీ సేవా సంస్థ పర్యవేక్షణలో ఒకటో పట్టణ ఎస్‌ఐ జమాల్‌వలి సతీమణి దివంగత హమీదున్నీసా జ్ఞాపకార్థం వెంగళరావునగర్‌లోని ఆయన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు చీరలు తువ్వాళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖాదర్‌బాష, దేవరకొండ విజయ్, ప్రసాదరావు, నాగరాజు పాల్గొన్నారు.


మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సీఐ గిరిబాబు, ఎస్‌ఐ జమాల్‌వలి

పోలేరమ్మకు పొంగళ్లు

కావలి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డులో వెలసిన పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, పొంగళ్లు సమర్పించారు. మూడు రోజులపాటు నిర్వహించే తిరునాళ్లను అత్యంత వైభవంగా చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సంతర్పణ గావించారు. రాత్రి అమ్మవారిని మృగరాజు వాహ నంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించి అమ్మవారిని దర్శించుకున్నారు.

రాజుపాలెం- ఇస్కపల్లి రోడ్డుకు త్వరలో మోక్షం

● సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్

అల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు ఎంతకాలంగా ఎదురుచూస్తున్న రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డుకు మోక్షం కలుగనుందని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే ప్రజలు ఇస్కపల్లి నుంచి అల్లూరు మీదుగా నెల్లూరు వైపునకు ప్రయాణం సాగించేందుకు ఎన్నో కష్టాలు పడుతున్నారని మరో పది రోజుల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెప్పారు. అలాగే తాగునీటి సమస్య, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ, విద్యాశాఖ, హౌసింగ్ శాఖల అధికారులు తమ నివేదికలను సభ ముందుంచగా వాటిపై పలు వివరాలును అడిగి తెలుసుకున్నారు. త్వరలో సమస్యలకు పరిష్కారాలను చూపించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేణమ్మ, ఎంపీడీఓ రజనీకాంత్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో మాట్లాడుతున్న బీద గిరిధర్, చిత్రంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఎంపీడీవో రజనీకాంత్

వింజమూరులో మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలి

వింజమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కస్తూర్బాగాంధీ మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు అల్‌ఇన్‌ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ మెంబరు ఎల్.రాజేష్ వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పెద్ద మండలం వింజమూరు అని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మోడల్ స్కూల్స్ ఉన్నాయని, వింజమూరు మండలంలో ఇప్పటివరకు లేదని నిరుపేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

భగవద్గీతపై ప్రచారం

ఉదయగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవవీధిలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో దుత్తలూరు కమిటీ సభ్యులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాబోయే ఉగాది పర్వదినం యొక్క విశిష్టతను ప్రజలకు శాస్త్రోక్తంగా వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి, ప్రేమ్‌కుమార్, సంతోష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో బోరు ఏర్పాటు

వింజమూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):స్థానిక జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో ఉదయగి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు సర్పంచ్ నల్లగొండ్ల సృజన ఆదివారం తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడంతో ఆయన స్పందించి కార్యదర్శికి ఆదేశించడంతో బోర్‌ను ఏర్పాటు చేశారు. వేసవికాలంలో తాగునీటి సమస్య రాకుండా అవసరమైతే వివిధ ప్రాంతాల్లో బోర్లు వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

ఆత్మకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని ఆత్మకూరు బ్రేక్ ఇన్స్‌పెక్టర్ రాములు పేర్కొన్నారు. ఆదివారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

● సంగం : సంగంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గునుపూడి గిరి, వేమా మల్లికార్జున, రాజా, గోపీ, ప్రభాకర్, మెంటా శ్రీధర్ పాల్గొన్నారు.

● అనంతసాగరం : స్థానిక గ్రంథాలయంలో అమరజీవి శ్రీపొట్టిశ్రీరా ములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : వింజమూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● దుత్తలూరు(ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సందానీ, సర్వేయర్ శివ, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రేక్ ఇన్స్‌పెక్టర్ రాములు


సంగం : అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళలు అర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నా నది ఒడ్డున వెలసి ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్న అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


నాగారపమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా గురుకులం వార్షికోత్సవం

ఆత్మకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఆర్ గురుకుల పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిత్య అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల కోరిక మేరకు పాఠశాలలో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ తరఫున సరస్వతి విగ్రహానికి మండపం నిర్మిస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కంచి పరమేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న గురుకులం ఉపాధ్యాయులు

వైభవంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఉదయగిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన పోతురాజు గంగమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా వేదపండితుల వేదమంత్రోచ్చరణాల మధ్య ప్రాతఃకాల పూజ, ప్రతిష్ఠ హోమం, శాంతి పౌష్టిక హోమలు, గర్తపూజ, యంత్ర, విగ్రహ, ప్రాణ, గోపుర, శిఖర ప్రతిష్ఠలు, మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు అమ్మవారి వాహనం వెంట వారుకడవతో నీరు పోసి కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, ప్రాజెక్టు చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డిలు పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ఆలయ కమిటీ చైర్మన్ పాముల రమణయ్య ప్రత్యేక అభినందనలు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

అనంతసాగరం మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిపాలెంకు చెందిన మల్లి నాగేశ్వరావు రోడ్డు ప్రమాదంలో, పీకేపాడుకు చెందిన తిరుపాల్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వారి పిల్లల చదుకు కోసం పీకేపాడుకు చెందిన హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ టీమ్ ముందుకు వచ్చి ఆదివారం రెండు కుటుబాలకు రూ.50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఆర్ వెంకటరమణారెడ్డి, కే పెంచలయ్య, బీ మురళి, హరి, లాయర్ చిన్నయ్య, ఈర్ల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందచేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడాలి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీఐడీ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడి నష్టపోయిన డిపాజిటర్లకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య డిమాండు చేశారు. ఆదివారం తూర్పుబోయమడగల, వరికుంటపాడు, జడదేవి గ్రామాల్లో నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో ఆయన మాట్లాడారు. ఆ భూముల్లోని జామాయిల్‌ను యథేచ్ఛగా నరికి తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తుండడం దారుణమన్నారు. భూములను పరిశీలించేందుకు వచ్చిన సీపీఐ నాయకులపై కొంతమంది దాడికి పాల్పడడం హేయమైన చర్యన్నారు. తమకేమి తెలియదని చెప్పే పాలకులు లారీలను అడ్డుకొని విచారణ చేయిస్తే వాస్తవాలు బయటపడతాయన్నారు. అలాగే మెట్ట ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించే గండిపాళెం జలాశయం పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందేలా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేయాలన్నారు. 75వేల ఎకరాలకు సాగునీరు అందించేలా పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుని వలసలను నివారించాలన్నారు. సీతారామ్‌సాగర్, మర్రివూట్ల రిజర్వాయర్ల పనులను సైతం వేగవంతం చేసేందుకు పాలకులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోడె రమణయ్య, వెంకటసుబ్బయ్య, వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకులు వెంకటయ్య

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

సీతారామపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లి పంచాయతీలో రూ.10లక్షలతో, మారంరెడ్డి పంచాయతీలోని గంధంవారిపల్లిలో రూ.5లక్షలతో, సీతారామపురం పంచాయతీలో రూ.15 లక్షలతో మండల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి మాట్లాడారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురువారెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ పాలగిరి అల్లూరురాజు, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్ , బాలినేని మాబయ్య,లకిడి బ్రహయ్య పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

ఉదయగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. ఆదివారం సెయింట్‌మేరీ పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ ఉన్నత, సెయిం ట్ మేరీ, హోలీ ఏంజల్స్, గండిపాళెం గురుకుల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 529, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 120 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

● దుత్తలూరులో: నందిపాడు, దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత, ఆదర్శ పాఠశాలల్లో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో వెంగయ్య తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో 469 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): స్థానిక ఉన్నత పాఠశాల కేంద్రంలోని పదో తరగతి పరీక్షలకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో రమణయ్య తెలిపారు. వరికుంటపాడు, జడదేవి, తిమ్మారెడ్డిపల్లి, కాకొల్లువారిపల్లి, తూర్పురొంపిదొడ్ల పాఠశాలలకు చెందిన 160మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. అలాగే విరువూరు, నార్త్‌కొండాయపాళెం, పెద్దిరెడ్డిపల్లి పాఠశాలలకు చెందిన మరో 77 మంది, ఉదయగిరి మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలకు వెళ్లాల్సి ఉందన్నారు. కాగా స్థానిక కేంద్రంలో చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా రమాదేవి, చలపతి వ్యవహరిస్తారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

24, 25తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

● ఏఐబీఈఏ సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 24, 25తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని ఏఐబీఈఏ సంయుక్త కార్యదర్శి వీ ఉదయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని ఎన్జీవో హోంలో ఆదివారం బ్యాంకు ఉద్యోగుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పనిదినాలు కల్పించాలనే డిమాండ్లతో సమ్మెకు దిగుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడు రమణ ప్రసాద్, బీఎస్ రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషను బతికించుకునే బాధ్యత అందరిది..

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఆదివారం రాత్రి నగరంలోని టౌనుహాలు (ఏసీహాల్)లో విశాలాక్షి మాసపత్రిక సాహిత్య సదస్సు, బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావాసులు బెజవాడ గోపాలరెడ్డి, మరుపూరు కోదండరామిరెడ్డిలతో తనకు అనుబంధం ఉందన్నారు. వారు కవులేకాక దాతలు కూడా అని చెప్పారు. రేబాల లక్ష్మీనరసారెడ్డి వంటి దాతలు ఎందరో సాహిత్యాన్ని పోషించారని తెలిపారు. సభకు 25 కళా సంఘాల గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం విశాలాక్షి సాహిత్య రచనల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. తదుపరి ఎంవీ.రామిరెడ్డి కథా వ్యాససాహిత్య సంపుటి, ప్రసార, కవిత్వ సాహిత్య వ్యాస సంపుటి, విస్తార పుస్తకాలను ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ డాక్టర్ విద్యాసాగర్, ఆత్మీయ అతిథులుగా జడపల్లి మాధవ, సుధాదేవి, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, కోసూరు బాలయ్య పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విశాలాక్షి పబ్లిషర్ కోసూరు రత్నం, ఎడిటర్ ఈతకోట సుబ్బారావు పర్యవేక్షించారు.

గిరిజనులకు 'ఉపాధి' కల్పించాలి: కలెక్టర్ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(జడ్పీ), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనులు అడగలేని పేద గిరిజన లబ్ధిదారులను గుర్తించి, పనులు కల్పించేలా చొరవచూపాలని కలెక్టరు ఆనంద్ అధికారులను ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకంపై క్షేత్ర స్థాయి సిబ్బందికి నెల్లూరులోని కస్తుర్బా కళాక్షేత్రంలో ఆదివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరు మా ట్లాడుతూ ఉపాధి లేని నిరుపేద ఎస్టీ కుటుంబాలందరికీ పనులు కల్పిం చాలని, ఇందుకోసం వారికి జాబ్ కార్డులు మంజూరు చేయాలని సూచించారు. పేదలందరికి కచ్చితంగా రోజుకు రూ.300 కూలి గిట్టుబాటు అయ్యేలా వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు. పనుల నాణ్యత, కొలతల్లో తేడా వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం సంచాలకుడు షణ్ముఖ కుమార్ మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతులు ఉపాధి పథకం ద్వారా పొలాల్లో నీటి గుంతలు తవ్వించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీ చంద్, డ్వామా పీడీ గంగాభవానీ, డ్వామా పైనాన్స్ అధికారి కనకదుర్గా భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

● జడ్పీ చైర్‌పర్సన్ అనం అరుణమ్మ

నెల్లూరు(జడ్పీ), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పైలు రాయని, సోమవారం నుంచి జరిగే ఆ పరీక్షలను ఎలాంటి ఆందోళన లేకుండా ఆత్మవిశ్వాసంతో రాయాలని జడ్పీ చైర్‌పర్సన్ అనం అరుణమ్మ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పదో తరగతి విద్యార్థులకు విజయదీపిక మెటీరియల్ అందజేశామని, అందరూ ఏకాగ్రతతో పరీక్షలు రాసి ఉత్తమ సాధించాలని ఆకాంక్షించారు.

ఏఎన్ఎంల ఉద్యోగోన్నతిపై విచారణ

- గందరగోళంగా వ్యవహారం
- ప్రకాశం, గుంటూరు జిల్లాల ఎంపిక జాబితా పరిశీలించాలి
- డీఎంహెచ్‌వో ఎదుట ఏవో వాగ్వివాదం
- కార్యాలయ సూపరింటెండెంట్ వైపే మొగ్గు చూపిన జిల్లా వైద్యాధికారి
- నిబంధనలకు విరుద్ధంగా జాబితా ఎలా తయారు చేస్తారని బాధితుల ఆందోళన
- యథావిధిగా నేడు కౌన్సెలింగ్

నెల్లూరు (వైద్యం) మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సచివాలయం ఏఎన్ఎంల ఉద్యోగోన్నతి జాబితాపై ఆదివారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత చేపట్టిన విచారణ గందరగోళానికి దారితీసింది. ఈ వ్యవహారం వైద్యాధికారుల మధ్య వాగ్వివాదానికి దారితీసింది. దీంతో ఆవేదన వ్యక్తం చేసిన అధికారి మధ్యలోనే లేచి తాను సోమవారం జరిగే కౌన్సెలింగ్‌లో పాల్గొనబోనని వెళ్లిపోయారు. సచివాలయం ఏఎన్ఎం జాబితా తప్పుల తడకగా ఉందంటూ, ఇందులో భారీ ఎత్తున అధికారులు ముడుపులు తీసుకున్నారని పలువురు ఆరోపించారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' లోనూ 'పైసలిస్తేనే పదోన్నతి' అనే శీర్షికన కథనం కూడా వచ్చింది. బాలిరెడ్డిపాళెంకు చెందిన ఎంబేటి కామేశ్వరి తనకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆరోపించారు. దీనిపై ఆదివారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో విచారణ జరిగింది. ఈ నెల 17న ఏఎన్ఎంల ఉద్యోగోన్నతికి సంబంధించి కౌన్సెలింగ్ జరగనున్నది. ఈ నేపథ్యంలో ముందుగానే విచారణ జరిగింది. దివ్యాంగుల కోటాలో ఉద్యోగోన్నతిలో తనకు అన్యాయం జరిగిందని బాధితురాలు డీఎంహెచ్‌వో ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. 8 మంది దివ్యాంగులకు ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉన్నా, కేవలం ఇద్దరికే కల్పించి, జాబితా తయారు చేశారంటూ ఆరోపించించారు. వెంటనే వైద్య ఆరోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తాజా ఉద్యోగోన్నతి జాబితాపై అభ్యంతరాలు తెలిపారు. వచ్చిన ఆరోపణలు పరిశీలించాల్సి ఉంటుందని డీఎంహెచ్‌వోకి నచ్చచెప్పారు.

● ఆ జాబితాలు పరిశీలించాలి..

ప్రకాశం, గుంటూరు జిల్లాల సచివాలయం ఉద్యోగోన్నతిలో నిబంధనలు పాటించి జాబితా తయారు చేశారని, వాటిని పరిశీలించి తప్పులు ఉంటే సరిద్దాలని సర్దిచెప్పారు. అయితే ఎస్టాబ్లిస్‌మెంట్ సూపరింటెండెంట్ వాదనకు దిగారు. తాము తయారు చేసిందే సక్రమమని వాదనకు దిగటంలో ఇన్‌చార్జ్ ఏవో ప్రకాశం, గుంటూరు జిల్లాల జాబితా పరిశీలించాలని, అందులో ప్రభుత్వ నిబంధనలు అన్ని ఉన్నాయని చెప్పినా డీఎంహెచ్‌వో సూపరింటెంటెండ్ వాదననే సమర్థించారు. దీంతో ఏవో ఆగ్రహం వ్యక్తం చేసి తాను సోమవారం జరిగే కౌన్సెలింగ్‌లో పాల్గొనలేనని బయటకు వెళ్లి పోయారు.



● లిఖితపూర్వకంగా ఇవ్వండి

విచారణలో పాల్గొన్న ఎంబేటి కామేశ్వరి భర్త విజయ ఉద్యోగోన్నతిలో తన భార్యకు అన్యాయం జరిగిందని, అయితే ఫైనల్ జాబితా సక్రమైనదేనని రాత పూర్తకంగా ఇవ్వాలంటూ పట్టుబట్టారు. దీంతో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత రాతపూర్వకంగా ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం. అయితే ఏఎన్ఎంల ఉద్యోగోన్నతిలో జరిగిన అవకతకలపై పూర్తి స్థాయి విచారణ జరిపేందుకు డీఎంహెచ్‌వో అంగీకరించలేదని తెలు స్తుంది. తమ శాఖలోని కొందరు అధికారులు చేసిన తప్పిదాలపై డీఎంహెచ్‌వో మౌనం వహించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పక్క జిల్లాలో తయారు చేసిన ఏఎన్ఎం ఉద్యోగోన్నతి జాబితా పరిశీలించాల్సి ఉన్నా వైద్య శాఖలోని కొందరు అధికారులు అడ్డు చెప్పటంతో వారి వాదనతో డీఎంహెచ్‌వో ఏకీభవించినట్లు తెలుస్తుంది. కలెక్టర్ ఆనంద్ ఈ జాబితాపై విచారణ జరిపిస్తే వాస్త వాలు వెల్లడవుతాయని పలువురు ఉద్యోగులు అంటున్నారు. ఇదిలా ఉంటే జాబితా తయారు చేసిన అధికారి విచారణలో పాల్గొనక పోవటం గమనార్హం. కాగా విచారణ మొత్తం రసాభాసగా ముగిసింది. అధికారులు రూపొందిన జాబితా ప్రకారమే సోమవారం (నేడు) కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

సోమశిలలో 55.399 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం మార్చి 16(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 55.399 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 600, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మసీదుల దుకాణాల అద్దెల సవరణ

● రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్‌బోర్డు పరిధిలోని మసీదుల దుకాణాల అద్దెలను సవరిస్తున్నామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం నెల్లూరులోని బార్కాస్ మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై దువా చేశారు. అనంతరం మాట్లాడుతూ అన్నీ మసీదుల స్వయం పరిపాలన కోసం వ్యాపార దుకాణాలు ఉంటాయన్నారు. ఆ దుకాణాలను తక్కువ అద్దెలకు ఇవ్వడం సమాజానికి తోడ్పడినట్లు కాదన్నారు. మార్కెట్ రేటుకు సమానంగా షాపులను అద్దెకిచ్చి వచ్చిన ఆదాయాన్ని ముస్లిం సమాజం అభివృద్ధికి ఉపయోగించాలని మసీదు కమిటీలకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ బోర్డుకు ఉన్న 30వేల ఎకరా లకు లీజు ఆక్షన్ పబ్లిష్ చేయబోతు న్నామని ప్రకటించారు. ఆ స్థలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకొన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కావలి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చినరాముడుపాలెం పొలాల్లో కోడి పందేల స్థావరంపై ఆదివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐలు బాజీబాబు, తిరుమల రెడ్డి సిబ్బంది వెళ్లి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కోడి పుంజు, రూ.1080 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితులు

నెల్లూరు(క్రైం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ సుజన్‌కృష్ణ అలియాస్ చింటూ హత్య కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులు ఆదివారం పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. నిందితుల్లో కొందరికి చింటూతో విభేదాలున్న నేపథ్యంలో హత్య జరిగినట్లు తెలిసింది. గతంలో చింటూ హత్యకు పథకం రచించినా తృటిలో అతను తప్పించుకున్నాడని పోలీసుల విచారణలో తెలిపినట్లు సమాచారం. హత్యకు కారణాలు, ఎవరిదైనా ప్రమేయం ఉందా అన్న కోణాల్లో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

ఎస్టీ వర్గీకరణతోనే యానాదుల అభివృద్ధి

● గోడపత్రిక ఆవిష్కరణలో నాయకులు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యానాదుల సంఘం నాయకులు

కావలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ వర్గీకరణతోనే యానాదుల అభివృద్ధి, సంక్షేమం సాధ్యం అవుతుందని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ.పెంచలయ్య తెలిపారు. రాష్ట్రంలో ఎస్టీ వర్గీకరణకు చర్యలు చేపట్టాలను కోరుతూ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న నెల్లూరులో ఎస్టీ వర్గీకరణ భేరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో ఆదివారం సంఘం నాయకులతో కలిసి ఎస్టీ వర్గీకరణ భేరీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నెల్లూరులో జరిగే ఎస్టీ వర్గీకరణ భేరీకి రాష్ట్రవ్యాప్తంగా యానాదులు, ఆ సామాజికవర్గ ఉద్యోగులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 37లక్షలున్న ఎస్టీ జనాభాలో యానాదులు 30శాతం ఉన్నారని చెప్పారు. వారు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజిక పరంగా వెనుకబడి ఉన్నందున ప్రత్యేక వర్గీకరణ అవసరం అన్నారు. సుప్రీంకోర్టు 2024 ఆగస్టు 1న ఇచ్చిన తీర్పునను సరించి ఎస్సీ వర్గీకరణ లాగే ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ రాపూరి క్రిష్ణయ్య, అధ్యక్షుడు మురళీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు, జిల్లా కోశాధికారి పోట్లూరి మురళీ, ప్రధాన కార్యదర్శి మలికి చెంచయ్య, నాయకులు చలంచర్ల రవీంద్ర, శివకుమార్, ఉష తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల గుంతలుగా రిజర్వ్ ఫారెస్ట్ భూములు!

- రూ.లక్షల్లో లీజు వసూళ్లు
- విద్యుత్ కనెక్షన్లకు ఏర్పాట్లు
- పట్టించుకోని అధికారులు

విడవలూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ భూములు కబ్జాదారుల చెరలో చిక్కుకుం టున్నాయి. ఇప్పటికే తీరప్రాంతంలో ఉన్న సుమారు 400 ఎక రాలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో సముద్రానికి, తీర ప్రాంత వాసులకు మధ్య రక్షణ గోడలా ఉంటున్న మడ అడ వులు అంతరించి పోతున్నాయి. దీనికి తోడు ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో ఏర్పాటవుతోన్న రొయ్యల గుంతలకు విద్యుత్ శాఖాధి కారులు అధికారికంగా కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. దీంతో ఆక్రమణ దారుల చర్యలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వీరాజిల్లుతు న్నారు. తీరప్రాంతంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా జిల్లా అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లైన లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతోన్నాయి, తాజాగా వరిణి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 910-1లో ఉన్న సుమారు 126 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూములు ఆక్రమదారుల చెరలో ఉన్నాయి.

70 ఎకరాల్లో రొయ్యల గుంతలు

మండల పరిధిలోని వరిణి రెవెన్యూ పరిధిలో రెవెన్యూ రికార్డులు ప్రకారం సర్వే నెంబరు 910-1లో 126 ఎకరాల రిజర్వ్ ఫారెస్టు భూములు ఉన్నాయి. అయితే ఆ భూములు తనవేనని ప్రముఖ న్యాయవాది కోర్టులో పిటీషన్ వేశారు. ఆ వ్యవహారం గత కొన్నేళ్లుగా కోర్టులో వాదనలు జరుగు తున్నాయి. అదే భూములను ఊటుకూరు పెద్దపాళెనికి చెందిన కొందరు కబ్జా చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా 70 ఎకరాల్లో ఉన్న మడ అడవులను జేసీబీతో నరికి కట్టలు పోసి రొయ్యల గుంతలుగా మార్చేశారు. ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేయ్యటమే కాకుండా వాటిని లక్షలకు లీజుకు ఇతరులకు ఇచ్చేస్తున్నారు.



రొయ్యల గుంతలుగా మారిన రిజర్వ్ ఫారెస్టు భూములు

> **విచారించి చర్యలు తీసుకుంటాం**
>
> వరిణి రెవెన్యూ పరిధిలో ఉన్న రిజర్వ్ ఫారెస్టు భూములు ఆక్రమించుకుంటే చట్టరీత్యా నేరం. దీనిపై విచారణ జరిపి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
>
> - చంద్రశేఖర్, తహసీల్దారు

● విద్యుత్ కనెక్షన్లకు ఏర్పాట్లు

వరిణి రెవెన్యూ పరిధిదిలో ఉన్న రిజర్వ్ ఫారెస్టు భూముల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి ముగ్గురు ఆక్రమితదారుల పేర్లతో రెవెన్యూ అధికారుల వద్ద ఎన్‌ఓసీలు తీసుకున్నారు. పట్టా పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు పెడుతున్నట్లు జిల్లా అధికారులకు లెక్కలు చూపి రిజర్వ్ ఫారెస్టు భూముల్లో పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు ఊటుకూరు సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న ఓ అధికారి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయన కనుసన్నల్లో రిజర్వ్ ఫారెస్టు భూముల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు కొందరు రైతులు అంటున్నారు. నిషేధిత భూముల్లో ఇప్పటికే ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు చేయడానికి దిమ్మెలను కూడా ఏర్పాటు చేశారు. సముద్ర తీరంలో ఆక్రమణల పర్వం కొనసా గుతుంటే సంబంధిత రెవెన్యూ, ఫారెస్టు, ట్రాన్స్‌కో అధికారులు తమకు ఏమి తెలియ దనట్లు వ్యవహరిస్తున్నారని మత్స్యకారులు వాపోతున్నారు. రొయ్యల గుంతలు తవ్వుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ తీసుకుని సముద్ర తీరాన్ని కాపాడాలని కోరుతున్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని కామాక్షి కాలనీ ప్రాంతంలో ముంబై జాతీయ రహదారిపై ఆదివారం కారు ఢీకొని ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. సంగం మండలం జండా దిబ్బ ప్రాంతానికి చెందిన రెహమత్(55) బుచ్చిలోని కామాక్షికాలనీలో నివాసం ఉంటున్న ఆమె సోదరి వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బుచ్చికి చెందిన డాక్టర్ అల్లాభక్షు బుచ్చి నుంచి నెల్లూరుకు వెళుతున్న కారు అదుపు తప్పి ఆమెను ఢీకొంది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

నెల్లూరు (క్రైం), (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని వేదాయపాళెం రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తి మరణించాడు. మృతదేహంపై మెరూన్, తెలుపు రంగు గీతల ఫుల్ హ్యాండ్స్ షర్ట్, దాని పైన ఖాకీ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ జీ మాలకొండయ్య మృతదేహన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

ఉదయగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో ప్రమాదశాత్తు ఒంటికి నిప్పంటుకున్న కూర్మాయి చిన పెంచలయ్య (72) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం చినపెంచలయ్య తన నివాసంలో వేడి నీళ్ల కాచేందుకు పొయ్యి మంట వేస్తుండగా ప్రమాదవశాత్తు ఒంటికి నిప్పంటుకుని తీవ్ర గాయాలైన సంఘటన విదితమే. కుటుంబ సభ్యులు గమనించి అతన్ని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

యువతిని మోసగించిన వ్యక్తి అరెస్టు

నెల్లూరు(క్రైం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో యువతుల పేరిట నకిలీ ఐడీలు సృష్టించి, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మోసగించి, బెదిరించే వ్యక్తిని చిన్న బజారు పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు కోటమిట్ట ప్రాంతానికి చెందిన ఓ యువతి బీకామ్ పూర్తి చేసి ఓ ఆన్‌లైన్ వాణిజ్య సంస్థలో పనిచేసింది. ఆమె సామాజిక మాధ్యమాల్లో రీల్స్ మెసేజ్ లు పెడుతుండేది. ఈ క్రమంలో ఆమె ఇన్ స్టాగ్రామ్ అకౌంట్‌కు ఏడు నెలల కిందట నవ్య డాక్టర్ బేబీ అనే ఐడీ నుంచి మెసేజ్ వచ్చింది. నీతో కలిసి పదో తరగతి చదువుకున్నానని మెసేజ్ చేయడంతో అలాంటి పేరుగల వారు ఎవరూలేరని గమనించిన ఆమె ఆ ఐడీని బ్లాక్ చేసింది. రెండు నెలల అనంతరం ప్రియాంక అనే ఐడీ నుంచి తిరిగి అదే మెసేజ్ వచ్చింది. దీంతో మహిళ అవతలి వారు ఎవరో తెలుసు కునేందుకు చాట్ చేయడం ప్రారంభించింది. కొద్ది రోజులు చాటింగ్ చేసిన తర్వాత ప్రియాం క ఐడీ నుంచి మహిళకు వాయిస్ కాల్ వచ్చింది. మాట్లాడగా అవతలి వ్యక్తి పురుషుడని తెలిసి ఎందుకు మోసం చేసి చాట్ చేస్తున్నారని నిలదీసింది. దీంతో అతను తన పేరు వెంకట జగన్ అని, తనది కర్నూలు జిల్లా అని చెప్పి మాటలు కలిపాడు. తనకు పోలీసు ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని, కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని మహిళను నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె ఫొటోలు, రీల్స్‌కు బూతు వీడియో లను జత చేసి యువతికి, యువతి స్నేహితురాలికి పం పాడు. దీంతో బాధిత యువతి అతనికి కాల్ చేసి ఎందుకలా చేశావని ప్రశ్నించగా రూ.50 వేలు నగదు, కమిట్‌మెంట్ ఇస్తే అలాంటి వీడియోలు పంపనని ఆమెను బెదిరించడం ప్రారంభించాడు. విసుగు చెందిన బాధితురాలు ఈ నెల 14న చిన్నబజారు పోలీసులకు ఫిర్యా దు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం అర్ధరాత్రి నిందితుడు జగన్‌ను అరెస్ట్ చేశారు.

మద్యం దుకాణంలో చోరీ



దుకాణం వెనుక వైపు ఉన్న కిటికీని ధ్వంసం చేసిన దుండగులు

ఉదయగిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌కు సమీపంలోని ఆర్‌వీ మద్యం దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. దుకాణం వెనుక వైపు ఉన్న కిటికీని ధ్వంసం చేసి దుకాణంలోకి ప్రవేశించారు. నగదు కౌంటర్‌లో ఏమీ లేకపోవడంతో అక్కడున్న చిల్లర నగదును తీసుకెళ్లారు. అలాగే ఎనిమిది మద్యం సీసాలతో పాటు దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా హార్డ్‌డిస్క్ చోరీ చేశారు. దుకాణం సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంపై తాపీగా మద్యం సేవించి చిల్లర నగదును అక్కడ పడేసి వెళ్లారు. ఆదివారం ఉదయం దుకాణం తీసిన నిర్వాహకులు విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	214
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8467
వెండి కిలో ధర	రూ. 103,400
వెండి ఒక గ్రాము	రూ.106.40

నెల్లూరు సిటీ
రూరల్, కోవూరు, సర్వేపల్లి

పొన్నవాహనంపై రంగనాథ పరిబ్రహ్మ

● రథోత్సవంలో భక్తుల సేవలో దాతలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవా ల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామికి పొన్నవాహనం పై ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఉత్సవాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. కాగా, ఆదివారం ఉదయం జరిగిన రంగనాథస్వామి రథోత్సవానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు వివిధ వ్యాపార సంఘాలు, భక్త మండళ్లు, వ్యక్తులు ప్రత్యేక సేవలు అందించారు. మజ్జిగ చలివేంద్రాలు, ప్రసాదాలు, పుచ్చకాయలు, వడపప్పు, పానకం అందించి ఆకలిదప్పులు తీర్చారు.



పొన్న వాహనంపై రంగనాథస్వామి

జూనియర్ ఎన్టీఆర్ సేవాదళ్..

రంగనాథస్వామి రథోత్సవం సందర్భంగా



మజ్జిగ అందజేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ సేవాదళ్ సభ్యులు

జూనియర్ ఎన్టీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. సేవాదళ్ అధ్యక్షుడు కే గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ జీ మధుసూదన్, సభ్యులు ఎన్ జగదీష్, జీ శ్రీధర్, మెంటా సుబ్రహ్మణ్యం, అశోక్ నిర్వహించారు.

● సంతపేటలోని కాళారెడ్డి సత్రం తరపున దేవదాయ శాఖ భక్తులకు అన్నప్రసాద వితరణ చేసింది. మజ్జిగ చలివేంద్రం నిర్వహించింది. కార్యక్రమాన్ని ఈవో జీ దుర్గయ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

● ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో అన్నదానం చేశారు. దీనిని నగర డీఎస్పీ సింధుప్రియ ప్రారంభించారు. కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి ఏవీ ఫణీంద్ర కుమార్, కోశాధికారి బోగనాథం సుబ్రహ్మణ్యం, యేలుచూరు శ్రీనివాసులు, పైడి మర్రి శ్రీరంగనాథ్ పర్యవేక్షించారు.

● సంతపేట సెంటర్‌లో మెంటా రామమోహన్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శ్రీరంగనాథ భక్త మండలి, శ్రీరాజరాజేశ్వరి భక్త మండలి సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని బీజేపీ నాయకుడు పీ సురేంద్ర రెడ్డి ప్రారంభించారు.

● వైకుంఠపురం కాశీనాయన ఆశ్రమం వారు భక్తులకు శీతలపానీయాలు, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆశ్రమ సేవకుడు ధన్వి శ్రీనివాస్, నక్కా శ్రీనివాస్, మోహన్, మహంకాళీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

త్రివిక్రముడికి విశేష పూజలు



నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రంగనాథస్వామి రథోత్సవం సందర్భంగా ఆదివారం స్టోన్‌హౌస్‌పేట వీవర్స్ కాలనీలో దశవతారాల్లో 5వ అవతారమైన శ్రీవామన త్రివిక్రమ స్వామి విగ్రహం ప్రతిష్ఠించి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీరంగనాథస్వామి అన్నదాన సమాఖ్య ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ముఖ్య అతిథిగా డీఆర్వో ఉదయభాస్కర్‌రావు హాజరయ్యారు. ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాడ విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు
పోరాటం స్ఫూర్తిదాయకం

నగర కమిషనర్ సూర్యతేజ
అమరజీవికి వివిధ వర్గాల ఘననివాళి

నెల్లూరు(సిటీ), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టిశ్రీరాములు చేసిన పోరాటం, ప్రాణార్పణ స్ఫూర్తిదాయకమని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ కొనియాడారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. శాంతియుత పోరాటాలతో విజయం సాధించవచ్చని ప్రపంచ దేశాలకు అమరజీవి చూపారన్నారు. ఆయన పేరును మన జిల్లాకు పెట్టుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం సంతపేటలో రంగనాయకుల స్వామి రథోత్సవంలో కమిషనర్ పాల్గొన్నారు. ఎంహెచ్‌వో చైతన్యతో కలిసి



నివాళులర్పిస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ప్లాస్టిక్ గ్లాసులకు బదులు స్టీల్ గ్లాసులతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని దాతలను కోరారు.

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో..

నెల్లూరు(విద్యఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి స్ఫూర్తి ఎందరికో ఆదర్శనీయమని, ఆయనను స్మరించుకోవడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీసీ డీ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీసీ మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అందరికీ మార్గదర్శకంగా నిలిచార న్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, ఏపీవో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

● డీఎంహెచ్‌వో కార్యాలయంలో.....

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమరజీవిని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, ఇన్‌చార్జి ఏవో డాక్టర్ వెంకటేశ్వర్లు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

● జనసేన నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్దనున్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి జనసేన పార్టీ నాయకులు ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణత్యాగానికి కూడా లెక్కచేయకుండా పోరాటం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం కిషోర్, ప్రశాంత్‌గౌడ్, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

● పొట్టిశ్రీరాములు ప్రాణ త్యాగం వల్లనే తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందిని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ అన్నారు. మూలాపేటలోని శ్రీరాములు విగ్రహానికి ఆదివారం బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు మార్చడం ఆయనను అవమానించడమే అన్నారు. తెలుగు ప్రజలను తెలంగాణ, ఆంధ్ర అంటూ వేరువేరుగా కాంగ్రెస్ ప్రభుత్వం చూడటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్ పద్మావతి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు శ్రీరాములు : అజీజ్

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : దళితులకు దేవాలయ ప్రవేశం కల్పించిన మహనీయుడు అమరజీవి పొట్టిశ్రీరాములు అని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఆదివారం శ్రీరాములు జయంతి సందర్భంగా టీడీపీ నాయకులతో కలిసి ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల అమరజీవి విగ్రహానికి పుష్పమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ఆలోచనలు, త్యాగాలు స్ఫూర్తిగా తీసుకుని అందరం రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు త్యాగాలు అందరికీ ఆదర్శమన్నారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేటను పొట్టిశ్రీరాములు బజారుగా మార్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేగు షణ్ముఖరావు, కన్యకాపరమేశ్వరి ఆలయం చైర్మన్ కోట గురుబ్రహ్మం, టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దర్శి హరికృష్ణ, కువ్వారపు బాలాజీ, జాఫర్, షరీఫ్, మిర్చి రవి, తదితరులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న కమిషనర్ సూర్యతేజ

● రంగనాయకుల పేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ కల్యాణ మండపంలో శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగర డీఎస్పీ సింధుప్రియ, అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, కార్యదర్శి ఏవీ ఫణీంద్రకుమార్, కోశాధికారి బోగనాధం సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు నివాళులర్పించారు.

● నగరంలోని ది క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో పొట్టిశ్రీరాములు జయంతి వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో బయ్యా వాసు, కోట గురుబ్రహ్మం, షేగు షణ్ముఖరావు, హైటెక్ రమణారెడ్డి, తాతా కిషోర్, శేషారావు, కోట మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



విద్యాశాఖ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పమాల వేస్తున్న డీఈవో బాలాజీరావు, అధికారులు

విద్యార్థుల రక్తదానం

నెల్లూరు (వైద్యం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్‌సీ క్రీడా మైదానంలో ఆదివారం ఉయ్ ఆర్ విత్ యూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. స్టేవ్‌వ్యూ సంస్థకు ఈ రక్తం అందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మౌనిక, రితిన్, తరుణ్, ఉమర్, రేష్మా, ఆశ్రిత తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం సక్సెస్ : నూనె

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సూపర్ సక్సెస్ అయిందని ఆ పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నెల్లూరుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ప్రత్యేక అనుబంధం ఉందని, అందుకే ఆయన నెల్లూరు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, లాయర్ శ్రీరామ్, గుడి హరిరెడ్డి, మార్కెట్ సురేష్ పాల్గొన్నారు.

609 మంది కార్యకర్తలతో ప్రారంభోత్సవాలు : కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో శరవేగంగా సాగుతున్న 303 అభివృద్ధి పనులకు 609 మంది కార్యకర్తల చేతులమీదుగా ప్రారంభోత్సవాలు చేయబోతున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం 1వ డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఒకే రోజు 105 ప్రాంతాల్లో శంకు స్థాపనలు నిర్వహించి ప్రత్యేకతను చాటామన్నారు. త్వరలో 303 పనులు పూర్తి చేసి 609 మంది కార్యకర్తలతో ప్రారంభోత్సవాలు చేయించి మరో చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దళితులకు న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం'

నెల్లూరు (హరనాథపురం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : దళితులకు న్యాయం చేయకపోతే ఉద్యమం చేస్తామని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ హెచ్చరించారు. ఆదివారం నగరంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందుకూరుపేట మండలం కొరుటూరులో దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను అగ్రవర్ణాల వారు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

మురికినీటికి అడ్డుకట్ట తొలగించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు (వైద్యం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భగత్ సింగ్ కాలనీలో మురికినీరు పోకుండా కాంట్రాక్టర్ ప్రయోజనం కోసం అడ్డుకట్ట వేయటంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అడ్డుకట్టను తొలగించకపోతే ప్రజలను కదిలించి కట్టను పగులకొడతామని ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి హెచ్చరించారు. నగరంలో నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్రలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. భగత్‌సింగ్ కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెన్నానది ఒడ్డునే భగత్‌సింగ్ కాలనీ ఉన్నా తాగేందుకు గుక్కెడు నీళ్లు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జలజీవన్ పేరుతో ఉచితంగా నీళ్లు ఇస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన మాట నెరవేరడం లేదన్నారు. నెల్లూరు నగరంలో ఇంటి పన్నులు, కొళాయి పన్నుల వసూలుకు ప్రజలను అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. పెన్నా రివిట్‌మెంట్ గోడ కాంట్రాక్టర్ జేబులు నింపడం కోసం పేదల ఇళ్లను అన్యాయంగా కూల్చి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌బి, సూర్యనారాయణ, టీపీ నరసింహ, మూలం ప్రసాద్, షేక్ జాఫర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మహాబోధి ఆలయాన్ని బౌద్ధులకు అప్పగించాలి

● ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘాల ఐక్యవేదిక

నెల్లూరు (హరనాథపురం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బుద్ధ గయలో మహాబోధి ఆలయ నిర్మాణ బాధ్యతలు బౌద్ధులకే అప్పగించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఐక్యవేదిక నాయకులు, భీమ్ ఆర్మీ రాష్ట్ర ఇన్‌చార్జి పీ ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఆలయ నిర్మాణంలో ప్రభుత్వ జోక్యం ఉండకూడదన్నారు. 1949 బీటీఎంసీ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుద్ధునికి జ్ఞానోదయం అయిన బుద్ధ గయ కేవలం మత కేంద్రం కాదని, భారతదేశ సంస్కృతికి వారసత్వ సంపదని, దానిని రక్షించుకో వాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకుడు బీఆర్ అంబేడ్కర్, సమాంతర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, భీమ్ ఆర్మీ నాయకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

పొదలకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణంలో జాతిపిత మహాత్మగాంధీ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, నాయకులు బక్కయ్యనాయుడు తదితరులు హాజరయ్యారు. టెంకాయలు కొట్టి భూమిపూజ నిర్వహించారు.



భూమి పూజ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోగలుగుతున్నామన్నారు. దీనికి పూర్తి సహకారం అందించిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో ఆర్యవైశ్యుల కల నెరవేరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య, జిల్లా వర్కింగ్ సెక్రటరీ పొట్టి సుధాకర్, నాయకులు రాచపూటి ధనుంజరావు, జొన్నలగడ్డ బ్రహ్మయ్య, కృష్ణం వెంకటరమణ య్య, పిన్నెల ప్రభాకర్, ఆకులూరు విజయ, మణిస్వామి, తన్నీరు సురే ష్‌బాబు, గుర్రం మీరా మధు, పైడా కామేశ్వరరావు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో పొట్టి శ్రీరాములు జయంతి

వెంకటాచలం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఆదివారం శ్రీపొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ప్రాంగణంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు భాషా పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడని, ఆయన చేపట్టిన నిరాహార దీక్ష భారతదేశ చరిత్రలో ఒక గొప్ప అధ్యాయమన్నారు. ఈ త్యాగఫలితంగానే ప్రత్యే క ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను అనుసరిస్తూ సమాజ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పొట్టిశ్రీరాములు త్యాగాలను స్మరించుకుంటూ సమాజంలోని సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, కావలి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ టీ.వీరారెడ్డి, వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులున్నారు.

● పొదలకూరులో...

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక పంచాయతీ బస్టాండ్ ఆవరణంలో ఆయన విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎస్ ఆర్ నెల్లూరు రూరల్ జిల్లా అధ్యక్షుడు అమర్త లూరు చెంచయ్య, పొట్టి సుధాకర్, తన్నీరు సురేష్, రాచపూడి ధనుంజయ, జొన్నలగడ్డ బ్రహ్మయ్య, గుర్రం మీరామధు, పిన్నెల ప్రభాకర్, వాకాటి ప్రసాద్, ఆకులూరు విజయ, పొట్టిశ్రీరాములు అభిమానులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు : శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తోటపల్లిగూడూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చిన్నచెరుకూరు, చెన్నపల్లిపాలెం, తోటపల్లి గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 272, కోడూరు గురుకులం నుంచి 79, ప్రైవేటు పాఠశాల నుంచి 105 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

బుచ్చిలో ఆరు పరీక్ష కేంద్రాలు

బుచ్చిరెడ్డిపాళెం : పదవ తరగతి పరీక్షలకు మండలంలో ఏర్పాటు చేసిన 6 కేంద్రాల్లో 1152 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో-2 పీవీ రత్నం తెలిపారు. డీఎల్ఎన్ఆర్ హైస్కూల్‌లో 243, రామచంద్రాపురం గురుకులంలో 261, వివేకానందలో 205, నారాయణలో 158, జడ్పీబాలికల హైస్కూల్‌లో 117, రేబాల సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 162 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

కోదండరామస్వామికి సోమిరెడ్డి పూజలు

వెంకటాచలం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్కపాళెంలో ఉన్న కోదండరామస్వామి ఆలయాన్ని ఆదివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సందర్శించారు. సోమిరెడ్డికి వేదపండితులతో ఆలయ ధర్మకర్తలు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. కాగా సాయంత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, బొమ్మి సురేంద్ర, చల్లా నాగార్జున్‌రెడ్డి, ఈపూరు మురళీధర్‌రెడ్డి, కుంచి శ్రీనివాసులుయాదవ్, అనసాపురం శ్రీనివాసులు, ఆలయ ధర్మకర్తలు పెళ్లకూరు నందకిషోర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మురళీకృష్ణకు జ్యోతిష్య సేవారత్న అవార్డు

ముత్తుకూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ముత్తుకూరుకు చెందిన జ్యోతిష్య శాస్త్రజ్ఞుడు డాక్టర్ బీ.మురళీకృష్ణకు ప్రతిష్ఠాత్మక జ్యోతిష్య సేవారత్న అవార్డు లభించింది. హైదరాబాద్ లో సర్ సీవీ రామన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విశ్వా వసు ఉగాది పురస్కారాల కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు వైవీ శాస్త్రి, సినీనటుడు కోట శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. దీంతోపాటు ఇండియా బెస్ట్ సర్ సీవీ రామన్ అవార్డును కూడా దక్కించుకున్నారు. జ్యోతిష్య శాస్త్రంలో సోషల్ మీడియాలో సందేహాలను తీర్చడం ఇతర అంశాల ఆధారంగా ఈ అవార్డులు దక్కాయి. ఈ అవార్డులు తన బాధ్యతను మరింత పెంచుతున్నాయని మురళీకృష అన్నారు.



అవార్డు అందుకుంటున్న మురళీకృష్ణ

మీరు రాజకీయ బ్రోకర్లు

● వైసీపీ నేతలపై టీడీపీ నేత సాబీర్‌ఖాన్ ధ్వజం


నెల్లూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లో పని చేసే బ్రోకర్లంటూ వైసీపీ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్‌పై టీడీపీ నేత సాబీర్‌ఖాన్ ధ్వజమెత్తారు. ఆదివారం నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ వైసీపీ నేత ఆనం జడ్పీ కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు దండుకునే నీచానికి దిగజారాడని దుయ్య పట్టారు. ఇక కార్పొరేటర్ బొబ్బల విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్లు, లైన్‌మెన్ ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయకుల వద్ద డబ్బులు దండుకుం టున్నాడని ఆరోపించారు. వైసీపీ నాయకులు నీతిమాలిన రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి

తోటపల్లిగూడూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలతో ఆదివారం కోడూరు సముద్రతీరంలో సందడి నెలకొంది. ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తికావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలసి తీరానికి తరలివచ్చారు. సాయంత్రం చీకటిపడే వరకు ప్రజల రాకపోకలు సాగాయి. యువత ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వీరేంద్రబాబు తన సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



కోడూరు తీరంలో ఉత్సాహంగా పర్యాటకులు



కిక్కిరిసిన భక్తులు



వారాంతపు సెలవుల నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 397మంది, రూ.200 శీఘ్ర దర్శనంలో 3,219.. రూ.50ప్రత్యేక దర్శనంలో 3,650 మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,090మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,234, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 321మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 234మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 98మంది పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,718 అమ్ముడుపోయాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

వాహనాల బారులు



అలిపిరిలోని భద్రతా తనిఖీల కేంద్రం ఆదివారం వాహనాలతో కిక్కిరిసిపోయింది. తనిఖీ కేంద్రం నుంచి గరుత్మంతుడి విగ్రహం ముందున్న ఆర్చ్ వరకు వాహనాలు బారులుతీరాయి. శ్రీవారి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు తిరుమల చేరుకుంటున్నారు. దీంతో వాహనాలను తనిఖీ చేసే అలిపిరి వద్ద వాహనాల సంఖ్య పెరిగిపోయిన క్రమంలో భద్రతా సిబ్బంది వేగవంతంగా తనిఖీ చేసి తిరుమలకు పంపారు. సాయంత్రం తర్వాత చెక్‌పాయింట్ వద్ద సాధారణస్థితి నెలకొంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వీఆర్‌కు గాజులమండ్యం

సీఐ, ఎస్ఐ?

రేణిగుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సుధాకర్‌ను వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. స్క్రాప్ లారీ తనిఖీ సందర్భంగా లంచం డిమాండు చేశారన్న అంశంపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. నాలుగు రోజుల కిందట కేఎల్ఎం హాస్పిటల్ కూడలిలో గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సుధాకర్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో తిరుపతి విమానాశ్రయ సమీపంలోని ఓ పరిశ్రమకు చెందిన స్క్రాప్ లారీ వెళుతుండగా ఆపి.. తనిఖీలు చేశారు. అదే సమయంలో డబ్బులు డిమాండ్ చేయడంతో.. ఈ విషయాన్ని కంపెనీ యాజమాన్యానికి డ్రైవర్ తెలిపారు. ఆ పరిశ్రమకు చెందిన యజమాని.. కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశారు. అక్కడ్నుంచి డీజీపీకి ఫోన్ కాల్ వచ్చింది. డీజీపీ ఆదేశాల మేరకు సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ సుధాకర్‌ను వీఆర్‌కు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి బాజ్‌పాయ్ పంపినట్లు సమాచారం. వీరి స్థానాల్లో ఏర్పేడు సీఐ జయచంద్ర, రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్ ఇన్‌చార్జులుగా ఆదివారం బాధ్యతలు స్వీకరించినట్లు తెలిసింది. దీనిపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజును వివరణ కోరగా.. ఘటన జరిగింది వాస్తవమేనని తెలిపారు. దీనిపై వివరణ ఇవ్వాలని డీఐజీ ఆదేశించడంతో వారు అనంతపురానికి వెళ్లారన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 (సోమవారం సాయంత్రం) సహర్: 5:00 (మంగళవారం ఉదయం)

'అమరజీవి'కి ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు మార్గం అనుసరణీయమన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో దేవేంద్రరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ, సాధికార అధికారిణి జ్యోత్స్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

విద్యార్థులూ.. ఆల్ ది బెస్ట్

నేటి నుంచి 'పది' పరీక్షలు



పరీక్షా కేంద్రాల వద్ద హాల్‌టికెట్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

తిరుపతి(విద్య/కలెక్టరేట్/నేరవిభాగం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి 31వ తేది వరకు.. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు పరీక్షలు మొదలవుతాయి. ఆయా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందే హాజరు కావాలని అధికారులు సూచిస్తున్నారు. ఇక, ఆదివారానికే పరీక్షా కేంద్రాలున్న తరగతి గదుల్లో డెస్కులపై హాల్‌టికెట్ నెంబర్లు వేశారు. ఆయా కేంద్రాల వద్ద బయట ఆయా హాల్‌టికెట్ నెంబర్ల ఆధారంగా కేటాయించిన తరగతి గదుల వివరాలతో నోటీసు బోర్డులు పెట్టారు. ఇక, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాల్‌టికెట్లలోని పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకుని నోటీసు బోర్డుల్లో తమ, తమ పిల్లల రూమ్ నంబర్లను నోట్ చేసుకున్నారు. లోపలకు అనుమతించిన కేంద్రాల్లో తమకు కేటాయించిన గదుల్లోకి వెళ్లి హాల్‌టికెట్ నంబర్ల ప్రకారం వారి స్థానాలను చూసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం చెప్పారు. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకుని, ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇక, తమ ఇళ్ల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లను చూపి పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సు సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని డీటీవో కేవీఎస్ కుమార్ తెలిపారు. స్వస్థలాల నుంచి, లేదా బస్టాండ్, రైల్వే స్టేషన్ల నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు ఈ అవకాశాన్ని కల్పించారు. ఇక, జిల్లా వ్యాప్తంగా 28,656 మంది విద్యార్థులు పరీక్షలు రాసే 164 కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 10 మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు.

పోలీసు అధికారులు

కావలెను!

- తిరుపతి డీఎస్పీ, ఈస్ట్, వెస్ట్ సీఐలుగా ఇన్‌చార్జులు
- స్పెషల్ బ్రాంచికి డీఎస్పీ లేరు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు వ్యవస్థను సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లా కేంద్రమైన తిరుపతి నగర డీఎస్పీ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తుండిన వెంకటనారాయణను బదిలీ చేసిన ప్రభుత్వం రెగ్యులర్ డీఎస్పీని నియమించలేదు. తాత్కాలికంగా మహిళా స్టేషన్ డీఎస్పీ శ్రీలతను ఇన్‌చార్జిగా నియమించారు. వీఐపీల తాకిడి, రాత్రి గస్తీలు, శాంతి భద్రతల పరిరక్షణ వంటివి కష్టతరమవుతున్నాయి. డివిజన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో ఈస్ట్, వెస్ట్‌లకు రెగ్యులర్ సీఐలు లేరు. వెస్ట్ సీఐగా పనిచేస్తుండిన రామకృష్ణను గతంలో ఎస్పీ సుబ్బరాయుడు ఇన్‌చార్జి సీఐగా అటాచ్‌మెంటు కింద నియమించారు. మొన్నటి వరకు వీఆర్‌లో ఉన్న మురళీమోహన్‌రావును తాత్కాలికంగా వెస్ట్ సీఐగా అటాచ్‌మెంట్ ఇచ్చారు. మరోవైపు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన గిరిధర్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఆయన మళ్లీ జాయిన్ అవుతారనే విషయం అనుమానంగానే ఉందన్న చర్చ నడుస్తోంది. జిల్లా మొత్తం స్పెషల్ బ్రాంచ్ వ్యవహారాలు సీఐ ఒక్కరే చూస్తున్నారు. అతను కూడా కొత్తగా బాధ్యతలు స్వీకరించడంతో జిల్లాపై పూర్తి స్థాయి అవగాహన లేదు. తిరుపతి ప్రాముఖ్యత దృష్ట్యా పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లా వ్యాప్తంగా

కార్డెన్ సెర్చ్

- 137 వాహనాల తనిఖీ.. 34 సీజ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం తెల్లవారజామున పోలీసులు అనుమానిత ప్రాంతాలు, కాలనీల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తిరుపతి వెస్ట్ సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఇందిరానగర్, ఎన్టీఆర్ సర్కిల్, తదితర ప్రాంతాల్లో పోలీసులు కార్డెన్ సెర్చ్ చేశారు. ఇందిరానగర్‌లో పోలీసులు ఇంటింటికీ వెళ్లి వారి అడ్రస్సులు, ఆధార్ కార్డులు పరిశీలించారు. 58 వాహనాలు తనిఖీ చేసి ఎలాంటి రికార్డులు లేని 30 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. శ్రీకాళహస్తి టూటౌన్ పరిధిలో వీఎంపల్లెలో 32 వాహనాలు తనిఖీ చేసి నాలుగు సీజ్ చేశారు. పుత్తూరు పరిధిలోని ముద్దుకృష్ణపురంలో 32 వాహనాలు.. నాగలాపురంలోని దొడ్డిమెట్ట ఎస్టీ కాలనీలో 15 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు సీఐ సురేంద్ర నాయుడు, సీఐలు ఓబయ్య, వెంకటేశ్వర్లు, సునీల్‌కుమార్, నాగలాపురం ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరులో పెద్దిరెడ్డి ఆటలు సాగనివ్వం

- అమరావతికి 15 రోజుల్లో రావాలంటూ చల్లాకు సీఎం చంద్రబాబు సూచన
- అశ్రునయనాల మధ్య టీడీపీ కార్యకర్త అంత్యక్రియలు



రామకృష్ణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పుతున్న ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఇకపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆటలు సాగవని, టీడీపీ శ్రేణులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త కాగతి రామకృష్ణను శనివారం వేటకొడవలితో వైసీపీ కార్యకర్త వెంకట్రమణ హత్య చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం ఉదయం 12 గంటలకు అంత్యక్రియలు జరగాల్సి ఉంది. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా వచ్చి రామకృష్ణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పబోగా కుటుంబీకులు నిరాకరించారు. తమకు న్యాయం జరిగేవరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దాడులు, అక్రమ కేసులు, దెబ్బలు తిన్న తాము.. ఇప్పుడూ తప్పులు చేయకపోయినా అదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని, ఇప్పుడు కుటుంబ పెద్దను కోల్పోయామని రామకృష్ణ భార్య దేవమ్మ, కుమారులు శివ, సురేశ్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రభుత్వంలోనూ న్యాయం జరగకపోతే ఏమి చేయాలని ప్రశ్నించారు. దీంతో చల్లా వెంటనే సీఎంకు ఫోన్ చేసి.. వీరితో మాట్లాడించారు. 'రామకృష్ణ హత్య దురదృష్టకరం.టీడీపీ అండగా ఉంటుంది. ఆందోళన చెందొద్దు. త్వరలోనే మంత్రులు, పార్టీ పెద్దలు మిమ్మల్ని కలుస్తారు. అంత్యక్రియలు చేయండి' అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అనంతరం చల్లాతో 10 నిమిషాలు సీఎం చంద్రబాబు ఫోన్లో మాట్లాడారు. అసెంబ్లీ తర్వాత 15 రోజుల్లో అమరావతికి రావాలని సూచించారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి అరాచకాలు అడ్డుకుంటూ.. పార్టీ శ్రేణుల సమస్యలపై చర్చించాలని, ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తవహించాలని చెప్పారు. రామకృష్ణను చంపినవారికి చట్టప్రకారం శిక్షపడేలా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. 'గతంలో దాదాపు 700 మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులపై వైసీపీ నేతలు అక్రమంగా 307 కేసులను పెట్టి ఇబ్బంది పెట్టారు. ఈ కేసులను ఎత్తివేయాలి. కార్యకర్తలు మన.. గత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం చూస్తున్నారు' అని సీఎంతో చల్లా అన్నారు. కాగా, సీఎం భరోసా ఇచ్చాక రామకృష్ణకు కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ నేతలు, శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు.

త్వరలోనే హంతకులను పట్టుకుంటాం: డీఎస్పీ

రామకృష్ణ హత్యకు కారకులైన వారిని పట్టుకోవడానికి నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. సీసీ పుటేజీ, సెల్‌ఫోన్ ట్రాకింగ్, సాంకేతిక ఆధారాలపై దృష్టి పెట్టామన్నారు. సీఐని సస్పెండ్ చేశామని, ఈకేసుపై విచారణ జరుగుతోందన్నారు. రామకృష్ణ హత్య నేపథ్యంలో కృష్ణాపురంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది.

వైసీపీ ముసుగు

తీయండి

- వారితో అంటకాగితే స్థాన చలనం తప్పదు
- పోలీసులకు శాప్ చైర్మన్ హెచ్చరిక

తిరుపతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'కొన్ని పోలీస్ స్టేషన్లు ఇప్పటికీ వైసీపీ ముసుగు కప్పుకుని ఉన్నాయి. కొందరు అధికారులు వైసీపీ నేతలతో అంటకాగుతున్నారు. ఇప్పటికే అధినాయకుడి దృష్టికి వారి జాబితా వెళ్లింది. అలాంటివారిని ఉపేక్షించేదిలేదు' అని శాప్ చైర్మన్ రవి నాయుడు హెచ్చరించారు. తిరుపతిలో ఆదివారం జరిగిన కూటమి నాయకుల సన్మాన కార్యక్రమంలో రవినాయుడు మాట్లాడారు. పార్టీ అధికారంలో ఉండి కూడా కార్యకర్తలను పోగొట్టుకుంటున్నామంటే పోలీసుల అలసత్వమే కారణమన్నారు. 'ప్రాణహాని ఉదంటూ పుంగనూరులో టీడీపీ కార్యకర్త రామకృష్ణ వీడియో పెట్టిన తర్వాత కూడా పోలీసులు చోద్యం చూశారు. అనంతరం ఆయన హత్యకు గురయ్యారు. ఇటీవల వైసీపీ నిర్వహించిన యువత పోరులో కొందరు కలెక్టరేట్ గేట్లు విరిచి, ఎన్‌హెచ్‌పై ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తే వారిని వదిలిపెట్టేశారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా వైసీపీ నేత అభినయ్ రెడ్డి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో హల్‌చల్ చేస్తే కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు. మా నాయకులపైన కేసులు పెట్టడం, సమస్యపైన వెళితే తాత్సారం చేయడంలో మాత్రం అత్యుత్సాహం చూపుతున్నారు. కార్యకర్తల మనోభావాలు కాపాడే విషయంలో మూడు పార్టీలు ఒకే నిర్ణయంతో ఉన్నాయి' అని రవినాయుడు అన్నారు.

కార్యకర్తల కష్టంతోనే

మనకీ పదవులు

- 'కూటమి' నాయకులకు ఘన సన్మానం

'గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంతో తలపడిన కూటమి కార్యకర్తల కష్టంతోనే మనకు ఈ పదవులు దక్కాయి. దశల వారీగా అందరికీ న్యాయం చేసేందుకు పార్టీ ముఖ్యులు సిద్ధంగా ఉన్నారు' అని నాయకులు అన్నారు. నామినేటెడ్, పార్టీ పదవులు పొందిన కూటమి నేతలు.. శాప్ చైర్మన్ రవి నాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ సీలాయలపాలెం విజయ కుమార్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కుమారమ్మ, కరాటే చంద్ర, బాలసుబ్రమణ్యంను ఆదివారం సత్కరించారు. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్ ఆధ్వర్యంలో తిరుపతిలోని నిర్మల రామయ్య కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. సన్మాన గ్రహీతలతో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి ప్రసంగించారు. కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకుంటున్న కూటమి నేతలు

పొట్టి శ్రీరాముల త్యాగం చిరస్మరణీయం



గూడూరులో పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తదితరులు

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాముల జయంతి సందర్భంగా స్థానిక పాత బస్టాండు సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అశువులు భాశారని కొయాయాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ నేడు సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సోమిశెట్టి చెంచురామయ్య, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్‌కుమార్, చంద్రమౌళి, అమరయ్య, రమేష్, నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా రూరల్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్, కనమర్లపూడి సుబ్రహ్మణ్యంశెట్టి, సామిశెట్టి వెంకటేశ్వర్లు, కోటా వెంకటేశ్వర్లు, యతి, కిరణ్, రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలో పొట్టి శ్రీరాములు క్యాంస విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

నాయుడుపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. ఎల్‌ఏ సాగరం గురుకులంలో 270 మంది, నారాయణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో 226మంది, ఎల్‌ఏ సాగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 260 మంది, జడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో 180 మంది, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 236మంది, సెయింట్ మేరీస్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 212మంది పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

వెంకటగిరి టౌన్: మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటగిరి పట్టణంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, ఆర్వీఎం ఉన్నత పాఠశాల, ఏపీఆర్ఎస్, ఏపీ మోడల్ స్కూల్, ఎస్టీ ఫ్రాన్సిస్ స్కూల్ కేంద్రాల్లో 1245 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఓజిలి: మండలంలోని ఓజిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 93మంది, చిల్లమానుచేను జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 143మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఎంఈవో ఎంఈవో శైలజ తెలిపారు.

బాలయపల్లి: మండల కేంద్రమైన బాలయపల్లిలో 81 మంది, వెంగమాపురంలో 38మంది, జయంపులో 38మంది, నిడిగల్లులో 36మంది, పిగిలాంలో 32 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో ప్రదీప్ తెలిపారు.

కోట: మండల కేంద్రమైన కోటలో ఆరు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. మొత్తం 971 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

దేవాంగులు ఐక్యమత్యంతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేవాంగులు ఐక్యమత్యంతో మెలిగితే అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించవచ్చని నెల్లూరు జిల్లా దేవాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో దేవాంగుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు, అనారోగ్యంతో ఉన్న వారికి వైద్య చికిత్స కోసం సంఘం ద్వారా ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శంకరయ్య, మాధవయ్య, శేషు, చంద్రశేఖర్, మదిరబాలయ్య, కొండా శేఖర్, శ్రీనివాసులు, హరికృష్ణ, సునీల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



మాంసం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు మాంసం విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంస దుకాణాల్లో నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రీజర్లలో నిల్వవుంచిన మాంసాన్ని విక్రయించినా, ప్లాస్టిక్ కవర్లలో మాంసాన్ని అందజేసినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరను విజయవంతం చేయండి

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలో ఈనెల 25వ తేదీ నుంచి జరగనున్న ముత్యాలమ్మ జాతరను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం జాతర ఆహ్వాన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టనున్నామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులను పొందాలన్నారు. కార్యక్రమంలో ఈవో నవీన్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, జలీల్‌ఆహ్మద్, నటశేఖర్, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఆళఘునాథస్వామి రథోత్సవం



గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అలంకరించి రథంపై అధిష్ఠింపజేసి, భక్తులు రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. పట్టణ పురవీధుల్లో రథోత్సవం వైభవోపేతంగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

కారు బోల్తా: వృద్ధురాలి మృతి



పెంచలమ్మ మృతదేహం

చిల్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొని బోల్తా పడిన ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆదివారం వేకువజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గూడూరు అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన పెంచలమ్మ(76) శనివారం శ్రీకాళహస్తిలోని తన కుమార్తె సునీత ఇంటికి వెళ్లింది. కుమార్తె, ఇద్దరు మనవరాళ్లతో కలిసి కారులో గూడూరుకు బయలుదేరారు. కోట క్రాస్‌రోడ్డు సమీపంలో వస్తుండగా కారు అదుపుతప్పి జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టును ఢీకొన్ని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పెంచలమ్మ తీవ్రంగా గాయపడగా, ఆమె కుమార్తె, ఇద్దరు మనవరాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆస్పతికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో పెంచలమ్మ మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





గుర్రప్పతోట సమీపంలో పచ్చిమిర్చి కోతలో కూలీలు - గోనె సంచిలో రవాణాకు సిద్ధం చేసి పచ్చిమిర్చి

పచ్చిమిర్చి కొనుగోళ్లలో దళారుల దందా

పతనమైన ధర, రైతుల్లో ఆందోళన

పెళ్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి సాగు చేసిన పచ్చిమిర్చి అమ్ముకుందామంటే దళారుల దందాతో ధరల పతనమవుతున్నాయి. పెళ్లకూరు మండలంలో రైతులు ప్రియాంక, బంగారం, వజ్రం తదితర రకాల పచ్చిమిర్చి సాగు చేశారు. మార్కెట్‌లో కిలో రూ.20 నుంచి రూ.25 ఉన్నప్పటికీ దళారులు రైతుల నుంచి రూ.14కే కొనుగోలు చేస్తుండటంతో పెట్టుబడి ఖర్చు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కానూరు, తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, రోసనూరు, దిగువ చావాలి, ఎగువ చావాలి, చెంబడిపాళెం, జీలపాటూరు తదితర గ్రామాల రైతులు వందలాది ఎకరాల్లో పచ్చిమిర్చి సాగు చేశారు. తొలినాళ్లలో పంట పచ్చదనంతో మురిపించినా వాతావరణంలో మార్పులు దెబ్బతీశాయి. మిర్చి పంటను ఎక్కువగా ఆకుముడత తెగుళ్లు ఆశించడంతో చాలా ప్రాంతాల్లో పంట దెబ్బతింది. పురుగు మందుల పిచికారితో పెట్టుబడి అంతకంతకూ పెరిగింది. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గినా ధరలు ఆశాజనకంగా ఉంటాయని భావించిన రైతులు పెట్టుబడి ఎక్కువైనా వెనకాడలేదు. అయితే పంటు అమ్ముకునే సమయంలో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో కిలో రూ.20నుంచి రూ.25 ధర ఉన్నప్పటికీ దళారులు రైతుల వద్ద నుంచి కిలో కేవలం రూ.14కే కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు సంబంధిత శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో తూకాల్లోనే మోసం జరుగుతోందని, తాము నిర్ణయించిన ధరకే విక్రయించేలా దళారులు పెత్తనం చెలాయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





ముళ్లపొదలతో అధ్వానంగా ఉన్న చెరువుకట్ట - కట్టపై ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

చెరువుకట్ట సుందరీకరణ

గూడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువుకట్ట సుందరీకరణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటుపాళెం జాతీయ రహదారి నుంచి గూడూరు పట్టణానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఓ వైపు ఒకటన్నర కిలోమీటరు మేర చెరువుకట్ట ఉంది. ఈ కట్టను ఆధునీకరించి అహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని వైసీపీ హామీ ఇచ్చినా గత ఐదేళ్లలో పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో చెరువుకట్టపై ముళ్లచెట్లు పెరిగిపోయి పొదలుగా మారి కళావిహీనంగా మారింది. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చెరువు కట్టను ఆధునికీకరించి అందంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే కట్టను అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకున్నారు. ఆదివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో ఒకటన్నర కిలోమీటరు మేర చెరువుకట్టపై ముళ్లపొదలను తొలగింపు పనులు చేపట్టారు. జంగిల్ క్లియరెన్స్ అనంతరం తుడా ఆధ్వర్యంలో కట్టకు రివిట్‌మెంట్ చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్, లైటింగ్, పచ్చదనం పెంపు, పార్కును అభివృద్ధి, ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై సదరన్ రైల్వే పరిధిలోని కవర్‌పేట, పొన్నేరి మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చెన్నై, నెల్లూరు మధ్య నడిచే పలు రైళ్లను రద్దు చేశారు. పొన్నేరి, కవర్‌పేట మధ్య పట్టాల మార్పిడి పనులు రెండు నెలలుగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు పనులు చేపట్టనున్నారు. ఆ సమయంలో రైళ్ల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నారు. చెన్నై - నెల్లూరు మధ్య నడిచే రైలు నెంబరు 6635, ఉదయం 8.10 నిమిషాలకు నెల్లూరు వైపు వెళ్లే రైలు, ఉదయం 10.30 గంటల సమయంలో నెల్లూరు నుంచి చెన్నైకి వెళ్లే రైలును పూర్తిగా రద్దు చేశారు. అలాగే చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే పలు సబర్బన్ రైళ్లు రద్దు అయ్యాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొంత ఆలస్యంగా నడిచే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు గూడూరు వరకే పినాకిని

పెరంబూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రైలు పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థల మరమ్మతుల కారణంగా సోమవారం విజయవాడ - చెన్నై సెంట్రల్ (నెం.12711) పినాకిని ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్‌కు బదులు గూడూరు వరకే నడుపనున్నారు. అలాగే, డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - విజయవాడ (నెం.12712) పినాకిని ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్‌కు బదులు సాయంత్రం 4.15 గంటలకు గూడూరు నుంచి బయల్దేరుతుందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

గుమ్మిడిపూండి మార్గంలో 21 రైళ్ల రద్దు

చెన్నై సెంట్రల్ - గూడూరు మార్గంలో ఈ నెల 17న మరమ్మతులు చేపట్టనుండటంతో చెన్నై మూర్‌మార్కెట్ - గుమ్మిడి పూండి మార్గంలో నడిచే 21 లోకల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 17 ఉదయం 9.25 నుంచి మధ్యాహ్నం 2.25 వరకు ఈ మరమ్మతు పనులు జరుగుతాయని తెలిపారు.

మున్సిపల్ కార్యాలయంలో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సూళ్లూరుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చిన్నయ్య తెలిపారు. పట్టణ పరిధిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీకి గాయాలు



గాయపడిన సిద్ధయ్య

సూళ్లూరుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ సిద్ధయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మన్నారు పోలూరుకు చెందిన సిద్ధయ్య ద్విచక్ర వాహనంపై సూళ్లూరుపేటకు వెళ్తుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్ధయ్యకు తీవ్రగాయాలు కాగా, టెంపోలోనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో దీపిక ప్రతిభ



దీపికకు మెడల్ అందజేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నాయుడుపేటకు చెందిన బి.దీపిక ప్రథమస్థానం సాధించినట్లు కోచ్ ఉయ్యాల పవన్‌కుమార్ తెలిపారు. జూన్‌లో జరగనున్న సౌత్ ఇండియా జోన్ తైక్వాండో పోటీల్లో దీపిక పాల్గొంటుందన్నారు.

తుమ్మూరులో చోరీ

నాయుడుపేట టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరులో చోరీ జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న సుబ్బయ్య నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసుకొని బంధువుల ఊరికి వెళ్లాడు. ఆదివారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి తలుపులను తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో దాచిన ఒక సవరం బంగారు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు.

దాడి ఘటనపై కేసు

పెళ్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన కోగిలి మణి శనివారం రాత్రి కర్రతో దాడి చేశాడు. గాయపడిన వెంకటేశ్వర్లును కుటుంబసభ్యులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి తరలించి చికిత్స చేయించారు. అనంతరం వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

దివ్యాంగులకు కూరగాయల అందజేత

గూడూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీవీసీ పార్కులో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో భాస్కర్ దాతృత్వంలో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రఫూఫ్, నాగరాజు, చెంచునారాయణ, రామమోహన్, ప్రభాకర్, ఇబ్రహీం, సురేష్, శ్రీనివాసాచారి, సుందరం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యాసరాలను అందజేశారు. కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునరెడ్డికి కురుగొండ్ల పరామర్శ



మల్లికార్జునరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డక్కిలి మండలం పలుగోడు గ్రామానికి చెందిన ఆదిరెడ్డి మల్లికార్జునరెడ్డిని ఆదివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. మల్లికార్జునరెడ్డికి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో చెన్నై అపోలో చికిత్స అందించారు. అనంతరం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే రామకృష్ణ ఆస్పత్రికి వెళ్లి మల్లికార్జునరెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికోల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు తదితరులు ఉన్నారు.

అంకులపాటూరులో గోదాము

చిల్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకులపాటూరులో నూతనంగా గోదామును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చిల్లకూరు పీఏసీఎస్ సీఈవో రాజనేని రామయ్యనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు 75 కిలోల బస్తాకు నెలకు రూ.10 చెల్లించి గోదాములో ధాన్యం నిల్వ చేసుకోవచ్చన్నారు.

భగవద్గీతపై అవగాహన

వెంకటగిరి టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లమ్మ గుడి, శివాలయం వీధిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భగవద్గీతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, అమరావతి, శ్రీను, చామంతి, కృష్ణ, ప్రబోధ, లీలా కృష్ణ, వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్పీ వినోద్‌కుమార్

పెళ్లకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీల్లో భాగంగా ఆదివారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో జరిగిన ఉపాధి పనుల వివరాలను డీఆర్‌పీ వినోద్‌కుమార్ వెల్లడించారు. పనులకు రానివారి పేర్లతో మస్టర్లు వేశారని, పనులు చేసిన కొంతమందికి వేతనం చెల్లించలేదని కూలీలు ఆరోపించారు. గ్రామసభలో ఫిర్యాదు చేసిన ప్రతి విషయాన్ని ఉన్నతాధికారులు తెలియజేసి చర్యలు తీసుకుంటామని వినోద్‌కుమార్ తెలిపారు.

కోటమ్మకు పూజలు



కోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలతో అలంకరించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యానగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధాకర్‌రావు

కోట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో ఉన్న తపోవనంలో ఆదివారం నెల్లూరుకు చెందిన సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి 200 మంది శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకొని మందులు పొందారు. వంద మందికి కంట్లో శుక్లాలు ఉండటాన్ని పరీక్షల్లో గుర్తించారు. 50 మందిని నెల్లూరుకు తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్లు సుధాకర్‌రావు, సువర్ణ తెలిపారు.

జూనియర్ కళాశాలల అధ్యాపక సంఘం అధ్యక్షుడిగా రవి



పదవీ స్వీకార ప్రమాణం చేస్తున్న ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘ నూతన కార్యవర్గం

తిరుపతి(విద్య), మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా చంద్రగిరి జూనియర్ కళాశాల ఎకనమిక్స్ అధ్యాపకులు వి.రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం తిరుపతిలో జరిగాయి. ఉపాధ్యక్షుడిగా పి.రాజనాల (చంద్రగిరి జూనియర్ కళాశాల కెమిస్ట్రీ అధ్యపకుడు), కార్యదర్శిగా సి.వంశీకృష్ణ(చంద్రగిరి జూనియర్ కళాశాల జువాలజీ అధ్యాపకుడు), సంయుక్త కార్యదర్శిగా టి.ఆర్.చక్రధర్ (పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ కళాశాల మ్యాథ్స్ అధ్యాపకుడు), కోశాధికారిగా బి.అనిల్‌కుమార్ (సత్యవేడు జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకుడు), మహిళా కార్యదర్శిగా డాక్టర్ పి.అమ్ముదేవి(పుత్తూరు ఎస్ఆర్ఎస్ కళాశాల తమిళ అధ్యాపకుడు), డాక్టర్ కె.రవీంద్రబాబు(వెంకటగిరి జూనియర్ కళాశాల మ్యాథ్స్ అధ్యాపకుడు), వి.ఎస్.రవి(వరదయ్యపాళెం కళాశాల ఎకనమిక్స్ అధ్యాపకుడు) రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. ఈ కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది.

జనసేనలో కష్టపడే వారికి గుర్తింపు

వెంకటగిరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జనసేనలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త జంపాల ప్రకాష్ అన్నారు. ఆదివారం పట్టణంలో పింజల వీరయ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసిన జనసైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాధమ్మ, చిరంజీవులు పాల్గొన్నారు.